క్లుప్తంగా

7న జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం



చేనేత కార్మిక దినోత్సవం నిర్వహణపై సూచనలిస్తున్న ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు

కరప: మండల పరిధిలో చేనేత కార్మికులుండే గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈ నెల 7న జాతీయ చేనేత కార్మికుల దినోత్సవాన్ని నిర్వహించాలని ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాస రావు అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన గ్రామ కార్యదర్శులతో సమావేశమై చేనేత కార్మికుల దినోత్సవం నిర్వహణపై చర్చించి, పలు సూచనలిచ్చారు. కూరాడ, వేళంగి, అరట్లకట్ట, గొర్రిపూడి గ్రామ పంచాయతీలలో చేనేత కార్మికులను, యువకులను సమావేశపరిచి, వారి వృత్తిని ప్రోత్సహించడానికి తీసుకునే చర్యలు తెలియజేయాలని ఈఓ పీఆర్డీ సూచించారు.

ప్రజాసేవకు ప్రాధాన్యమివ్వాలి



లయన్స్‌క్లబ్ కార్యవర్గంతో బాదం బాలకృష్ణ

కరప: పేదల అవసరాలు గుర్తించి సేవా కార్యక్రమాలు చేపట్టాలని మాజీ జిల్లా గవర్నర్ బాదం బాలకృష్ణ వేళంగి లయన్స్‌క్లబ్ సభ్యులకు సూచించారు. మండలం వేళంగిలోని శ్రీనివాసా నర్సింగ్‌హోమ్‌లో శనివారం క్లబ్ మాజీ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరామన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్తకార్యవర్గాన్ని ఎన్నుకోగా వారితో బాలకృష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షుడిగా మెర్ల రాజేంద్ర ప్రసాద్, కార్యదర్శిగా బొండా సూర్యనారాయణ, కోశాధికారిగా ఇళ్ల ఆదేశ్, మెంబర్‌షిప్ డైరెక్టర్‌గా డాక్టర్ బొండా సూర్యారావు, సభ్యులుగా మెర్ల సీతారామప్రసాద్, పాతూరి శ్రీహరి చౌదరి ఎన్నికయ్యారు.

నేడు భాగవత ప్రవచనం

కాకినాడ కల్చరల్: స్థానిక చల్లా జగన్నాథశర్మ కల్యాణమండపంలో అస్వాదన సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు భాగవతంపై ప్రవచనం నిర్వహించనున్నట్టు సమితి కార్యదర్శి కారుప్రోలు గౌరి నాయుడు తెలిపారు. ప్రముఖ ఉపన్యాసకులు గొట్టిముక్కల వేంకట సత్య నరసింహాశాస్త్రి భాగవతంలోని తృతీయ స్కందంపై ప్రవచనం చేస్తారని కారుప్రోలు తెలిపారు.

10న నులిపురుగుల నివారణ కార్యక్రమం

కరప: మండల పరిధిలో ఈనెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులతో కలసి ఈ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్, వైఎస్సార్ సీపీ మండలయూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

డీవార్మింగ్ మందులు సిద్ధం

కాకినాడ రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కర్రె స్వప్న పాల్గొని మాట్లాడుతూ పండూరు, తూరంగి పీహెచ్‌సీల పరిధిలోని 137 స్కూల్స్, 71 అంగన్వాడీ సెంటర్లు, మూడు కళాశాలల్లో 33,195 మంది విద్యార్థులకు పంపిణీ చేసేందుకు డీవార్మింగ్ మందులు సిద్ధం చేశారు. ఈ నెల 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఎంఈవోలు, హెచ్‌ఎంలు, టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా గిడ్డంగుల సంస్థ ఆవిర్భావ దినోత్సవం



నడకుదురు గోదాం వద్ద మొక్క నాటుతున్న మేనేజర్ సత్యనారాయణ తదితరులు

కరప: మండలం నడకుదురు గోదాంలలో శనివారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేనేజర్ బందా సత్యనారాయణ మాట్లాడుతూ నడకుదురు గోదాంలో 150 మంది హమాలీలు ఉపాధి పొందుతున్నట్టు వివరించారు. సంస్థ విశ్రాంత జీఎం ఇండుగుల ప్రసాదనాయుడు, సిబ్బంది, కార్మికులతో కలసి గిడ్డంగుల ఆవరణలో మొక్కను నాటారు. తర్వాత విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. విశ్రాంత మేనేజర్లు రవణం చుక్కారావు, మార్కండేయులు, హక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చేయూత

- స్వయం ఉపాధికి సహకారం
- ఏటా ఖాతాలకు రూ.18,750 జమ
- ఆర్థిక స్వావలంబన సాధన

పథకానికి అర్హతలు ఇవే

- చేయూత పథకంలో చేరడానికి 45 ఏళ్లు నిండి ఉండాలి.
- 60 ఏళ్లలోపు వారు మాత్రమే అర్హులు.
- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ మహిళలై ఉండాలి.
- ఆధార్‌కార్డులోని వయసు ప్రామాణికంగా ఎంపిక.



జగనన్న చేయూత ద్వారా రామకృష్ణారావుపేటలో కిరణాషాపు నిర్వహిస్తున్న మహిళ

బోట్‌క్లబ్: సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. 45 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీల మహిళలకు ఈ పథకం వర్తింపచేసి వారి ఖాతాల్లో ఏటా రూ.18,750 వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఆ డబ్బులతో మహిళలు చిరు వ్యాపారాలు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. నగరంలో అర్హులైన 13,859 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో వారి ఖాతాల్లో మళ్లీ సీఎం జగన్ నగదు జమచేయనున్నారు.

జీవనోపాధి కల్పిస్తున్న ప్రభుత్వం

ఏపీ ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకం కింద మరో ప్రయోజనం కూడా కల్పిస్తుంది. ఈ పథకంలో భాగంగా అర్హత కల్గిన వారికి కిరణా షాపులు, గేదెలు, ఆవులు, మేకల యూనిట్లు కూడా ఏర్పాటు చేస్తోంది. దీని కోసం ప్రభుత్వం అమూల్, రిలయన్స్, పీఅండ్‌జీ, ఐటీసీ వంటి పలు సంస్థలతో కూడా ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇలా ఆసక్తి కలిగిన వారికి రాష్ట్ర ప్రభుత్వం చేయూత అందిస్తోంది.

కావాల్సిన డాక్యుమెంట్లు ఇవే

వలంటీర్‌కు ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌పుస్తకం, పాస్‌పోర్టు సైజు ఫొటో, రేషన్ కార్డు, మొబైల్ నెంబర్ అందించాలి.

అర్హులందరికీ పథకం వర్తింపు

అర్హులందరికీ పథకం వర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నగరంలో గత ఏడాది 13,859 మందికి లబ్ధి చేకూరగా ఈ ఏడాది మరింత మందికి ప్రయోజనం చేకూరనుంది.

కుటుంబానికి ఎంతో ఉపయోగపడింది



మూడేళ్లుగా వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ. 56,250 లబ్ధి చేకూరింది. ఈ డబ్బులు కుటుంబ అవసరాలకు తోడ్పడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మహిళలను ఎంతగానో ఆదుకుంటున్నారు.

– డి.కుమారి, చేయూత లబ్ధిదారు

మనసున్న ముఖ్యమంత్రి



పేదల బాధలు తెలుసుకుని ఏటా అనుకున్న సమయానికి మమ్మల్ని ఆదుకొంటున్న ఏకైక సీఎం జగన్. చేయూత డబ్బులు మా కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉపయోగపడుతున్నాయి.

– వేల్పూర్తి సత్యలక్ష్మి పద్మావతి, చేయూత లబ్ధిదారు

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



పైలాన్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి త్వరలో సామర్లకోట రానున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. సీఎం పర్యటనలో భాగంగా నగరపాలక సంస్థ తరఫున పైలాన్ ఏర్పాటుతో పాటు మరికొన్ని సౌకర్యాల కల్పన బాధ్యతను నగరపాలక సంస్థ పర్యవేక్షిస్తోంది. పైలాన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఈఈ పి.వెంకట్రావు, ఏఈ వై.నాగేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



గొర్రిపూడిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేకూరుతోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప, గడపకూ మనప్రభుత్వంలో భాగంగా శనివారం గొర్రిపూడి–2 గ్రామసచివాలయం పరిధిలోని ఆయన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చీకాల అప్పలరాజు, సర్పంచ్ కె.రమాదేవి, స్థానిక నాయకులు, అధికారులు తదితరులతో కలసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల ద్వారా వారు అందుకున్న లబ్ధిని వివరించారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు గడప, గడపకూ వెళ్లి ప్రజల ఆశీర్వాదాలు కోరుతున్నామని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు జల్దాని ఏసుగంగాధర్, ఊబా కిశోర్, మార్నెళ్ల వెంకటరమణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో 'రాజీవ్ గృహకల్ప' సుందరీకరణ

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రాజీవ్ గృహకల్ప ప్రాంగణాన్ని రూ.5 కోట్లతో సుందరీకరించేందుకు చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన గృహకల్ప ప్రాంగణంలో ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. మొత్తం 60 బ్లాక్‌లకు తొలుత రూ.50 లక్షల సీఎస్సార్ నిధులతో 10 బ్లాక్‌లలో పనులను ఆయన ప్రారంభించారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్లు నిర్మించారని, 15 ఏళ్లు పైబడడంతో పలు భవనాలు మరమ్మతులకు గురైన విషయాన్ని ఇటీవల గడప గడపకూ తిరిగిన సందర్భంగా స్థానికులు తనకు వివరించారని ఆయన అన్నారు. ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వివరించగా మొత్తం రాజీవ్ గృహకల్ప ప్రాంగణంలో రూ.2 కోట్లతో సింటెక్స్ వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్టోబర్ నాటికి ఇది పూర్తవుతుందన్నారు. ఇక విడతకు 10 బ్లాక్‌ల చొప్పున మొత్తం రూ.3 కోట్ల ఖర్చుతో ఇళ్లకు మరమ్మతులు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి ప్రజల సంక్షేమం, అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో ఉన్నారనడానికి ఇదే నిదర్శనమని, ప్రజలందరూ మరోసారి ఆయనను ఆశీర్వదించాలని కోరారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్‌ఈ పి.సత్యకుమారి తదితరులు ఆయన వెంట ఉన్నారు.



రాజీవ్ గృహకల్ప ఆధునీకరణ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

మోసపూరిత వాగ్దానాలు నమ్మవద్దు

- గడపగడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రాజకీయ లబ్ధి కోసం టీడీపీ, జనసేన పార్టీలు చేసే మోసపూరిత వాగ్దానాలు నమ్మవద్దని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక 33వ డివిజన్‌లోని కొత్తపేట మార్కెట్, చిన్న మసీదు, సినిమా రోడ్డు ప్రాంతాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుంటూ నాలుగేళ్ల పాలనలో అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను నమ్మించేందుకు తప్పుడు హామీలతో ఆ రెండు పార్టీలు ప్రజల ముందుకు వస్తున్నాయన్నారు. అలాంటి పార్టీలపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్ మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఆయన వెంట కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్‌కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, స్థానిక నాయకులు బోరా వెంకటేశ్వరరావు (పెద్ద), పోలిశెట్టి పద్మావతి, చోటు, రోకళ్ల సత్యనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి

- ఐలు రాష్ట్ర నాయకుడు రాజగోపాల్
- ఘనంగా ఆరవ మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న మేడపాటి ధర్మారెడ్డి తదితరులు

కాకినాడ లీగల్: దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలని అలిండియా లాయర్ యూనియన్ (ఐలు) రాష్ట్ర నాయకుడు డి.రాజగోపాల్ డిమాండ్ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 'ఐలు' ఆధ్వర్యంలో ఆరో మహాసభ కాకినాడ బార్ అసోసియేషన్ హాల్లో శనివారం నిర్వహించారు. మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేడపాటి ధర్మారెడ్డి అధ్యక్షత వహించగా రాజగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐలు చేసిన కార్యక్రమాల నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరాచార్యులు ప్రవేశపెట్టగా సభ్యులంతా ఆమోదించారు. అనంతరం ఐలు 2023–25 జిల్లా, నగర కమిటీల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ మేడపాటి ధర్మారెడ్డి (కాకినాడ), ప్రధాన కార్యదర్శిగా జి.భాస్కరాచార్యులు (పిఠాపురం), ఉపాధ్యక్షులుగా ఇక్బాల్ (అమలాపురం), ఆర్వీ రమణారావు (పిఠాపురం), కార్యదర్శులుగా కేఆర్‌కే రాజు (ముమ్మిడివరం), టీవీవీ రమణమూర్తి (అనపర్తి), జాయింట్ సెక్రటరీగా సుదిన శ్రీనివాస్ (కాకినాడ), కోశాధికారిగా వెంకటరెడ్డి బహదూర్ షా (కాకినాడ)తో పాటు 26 మంది సభ్యులతో నూతన ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నికైంది. నగర కమిటీ అధ్యక్షుడిగా పి.రామచంద్రరాజు, కార్యదర్శిగా కె.నాగజ్యోతి, వైస్ ప్రెసిడెంట్‌గా ఉమామహేశ్వరావు, ట్రెజరర్‌గా టి.రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీగా దేశీతో పాటు 12 మంది ఎన్నికయ్యారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ



సిరిపురం పాఠశాల హెచ్‌ఎంకు ప్రింటర్, క్రీడా సామగ్రి అందజేస్తున్న డాక్టర్ నరసింహారావు

కరప: మండల సిరిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకుని వైద్య వృత్తిలో స్థిరపడిన డాక్టర్ నున్న నరసింహారావు, ఆయన కుమారుడు డాక్టర్ నున్న రవికుమార్ పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేశారు. డాక్టర్ నరసింహారావు కుటుంబ సభ్యులతో వచ్చి రూ 50 వేలు విలువ చేసే ప్రింటర్, క్రికెట్ బ్యాట్‌లు, షటిల్ బ్యాట్‌లు శనివారం హెచ్‌ఎంకు అందజేశారు. సర్పంచ్ నున్న సుజాత, వైఎస్సార్ సీపీ నాయకుడు నున్న వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణతో అదుపులో శాంతిభద్రతలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ అశోక్ కుమార్, చిత్రంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: గడచిన ఆరు నెలల్లో జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశాన్ని డీఐజీ నిర్వహించారు. నేరాల నియంత్రణ వల్ల శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. తీవ్ర నేరాలు 50 శాతం తగ్గాయన్నారు. ఆస్తి సంబంధ నేరాల నియంత్రణకు మరింత పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. అక్రమ మద్యం, రౌడీ మూకలు, గంజాయి రవాణా, విక్రయదారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గడం ప్రోత్సాహకరమన్నారు. చిన్నపిల్లలపై నేరాలలోనూ నియంత్రణ నమోదైందని డీఐజీ తెలిపారు. అడిషనల్ ఎస్పి శ్రీనివాస్, సెబ్ అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై నిరసన

కాకినాడ సిటీ: మణిపూర్ ఘటనల్లో నిందితులను ఉరితీయాలని, అక్కడ మానవహక్కులను కాపాడాలని పీడీఎస్‌యూ, ఏఐకేఎంఎస్ ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో ఆదివాసీ విద్యార్థులు శనివారం రాత్రి జేఎన్‌టీయూకే వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ



వందేభారత్ రైలు హాల్ట్ సాధించిన ఎంపీ గీతను అభినందిస్తున్న మాజీ మంత్రి కన్నబాబు



మహిళలకు వైఎస్సార్ సంపూర్ణపోషణ కిట్లను పంపిణీ చేస్తున్న వీరభద్రం తదితరులు

కాకినాడ రూరల్: ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. నగరంలోని రూరల్ డివిజన్ 48 ఎస్.అచ్చుతాపురంలో శనివారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ కిట్లును వారు పంపిణీ చేశారు. కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, గవర్నర్ ఎమ్మెల్సీ అభ్యర్థిని కర్రి పద్మశ్రీ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏడీసీ నాగనరసింహారావు, ఏసుబాబు, దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

వందేభారత్ హాల్ట్ సాధన అభినందనీయం

సామర్లకోటలో వందేభారత్ రైలు హాల్ట్ సాధించిన ఎంపీ వంగా గీతకు ప్రజలందరి తరఫున ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అభినందనలు తెలియజేశారు. కన్నబాబు ఆధ్వర్యంలో 48వ డివిజన్ ఎస్.అచ్చుతాపురంలో శనివారం అంబేద్కర్ కాంస్య విగ్రహ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ గీతకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

కాకినాడ సిటీ: స్థానిక గోపీకృష్ణాకాలనీలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఆతం వీరభద్రం పాల్గొని, బిడ్డకు తల్లిపాలు పట్టించడం బిడ్డకే కాకుండా తల్లి ఆరోగ్యానికీ మంచిదని అన్నారు. గర్భిణులకు, తల్లులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త లోవలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకే పర్యావరణ ప్రాజెక్టులకు మహర్దశ



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న గ్రీన్‌కో ఆర్కిటెక్ టీమ్

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఆవరణలో పర్యావరణ ప్రాజెక్టులకు మహర్దశ రానుంది. మియావకి ఫారెస్టు, నక్షత్ర వనం జంగిల్ రీడింగ్ బుక్ వంటి ప్రాజెక్టులను మరింత పచ్చదనంతో వృద్ధి చేయనున్నారు. ఈ మేరకు సునీల్ చారిటబుల్ సంస్థను వీసీ ప్రసాదరాజు సంప్రదించగా వారికి ఉన్న జెన్‌కో సంస్థ ద్వారా వర్సిటీలో మౌలిక వసతుల నిమిత్తం రూ.5 కోట్లు మంజూరు చేసేందుకు అంగీకరించారు. వీసీ సమావేశ మందిరంలో శనివారం ఈ మేరకు ఇంజినీరింగ్, జెన్‌కో ఆర్కిటెక్ బృందంతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ నెల 23 నుంచి ప్రారంభమై మూడు దశలో 2024 ఏప్రిల్‌కు పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కోనాడకు వైఎస్సార్ సీపీతో సంబంధం లేదు



సుంకర శివప్రసన్న

కాకినాడ: టీడీపీలో చేరిన కోనాడ ప్రకాశరావుకు తమ పార్టీతో ఎటువంటి సంబంధం లేదని వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న స్పష్టం చేశారు. పార్టీడ 16వ డివిజన్ ఇన్‌చార్జి టీడీపీలో చేరిక అంటూ వచ్చిన ప్రకటనపై ఆమె శనివారం విలేకరులతో మాట్లాడారు. 2021లో జరిగిన ఉప ఎన్నికలో ప్రకాష్‌రావు వైఎస్సార్ సీపీ టికెట్ ఆశించగా సీనియర్ అయిన పేర్ల జోగారావుకు ఇచ్చారని, దీంతో ఆయన స్వతంత్రంగా పోటీచేసి ఓటమి పాలయ్యారని అప్పటి నుంచి ఆయనతో పార్టీకి సంబంధం లేదని, తాజాగా 16వ డివిజన్ ఇన్‌చార్జినని చెప్పుకుంటూ టీడీపీలో చేర్చుకుని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని శివప్రసన్న అన్నారు. సీఎం జగన్, ఎమ్మెల్యే ద్వారంపూడిపై అన్ని ప్రాంతాల్లోని కేడర్‌కు సంపూర్ణ విశ్వాసం ఉందని, తమ పార్టీని విడిచి టీడీపీలోకి వెళ్లేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్న విషయాన్ని ఆ పార్టీ నేతలు గుర్తించాలని ఆమె హితవు పలికారు.

మొక్కలతో కాలుష్య నివారణ

బోట్‌క్లబ్: స్థానిక లయన్స్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్ఆర్ నగర్‌లోని పార్కులో 100 మొక్కలను నాటారు. క్లబ్ అధ్యక్షురాలు మాండలిక ప్రసూన మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలు నాటడం ఒక్కటే పరిష్కారం అన్నారు. కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ బులుసు శ్రీవాణి, సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే దళితులకు రక్షణ

కాకినాడ సిటీ: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోకపోతే మణిపూర్ తరహాలో దేశవ్యాప్తంగా అల్లర్లు సృష్టించేందుకు, మనువాద రాజ్యాంగాన్ని అమలులోకి తీసుకొచ్చేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఏపీ వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు పేర్కొన్నారు. కాకినాడలోని యుటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఏపీ వ్యవసాయకార్మికసంఘం, కులవివక్ష వ్యతిరేకపోరాట సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై దాడులు, చట్టాల అమలు తదితర అంశాలపై మాట్లాడారు. 22 డిమాండ్లను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ ప్రవేశపెట్టగా సదస్సులో ఆమోదించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.సురేష్‌కుమార్, సీపీఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్ పాల్గొన్నారు.

భీమేశ్వర ఆలయంలో సామూహిక పూజలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో వచ్చేనెల 8న సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారథి శనివారం తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా 500 మంది ఈ పూజలు నిర్వహిస్తున్నామన్నారు.